క్లుప్తంగా

శ్రీఅంకమ్మతల్లి శక్తిపీఠంలో ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీ కాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో శుక్రవారం అమావాస్య పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, శ్రీ చక్రార్చన శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో...

అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శుక్రవారం అమావాస్య సందర్భంగా శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన శ్రీ శివకామేశ్వరీ అమ్మవారికి శ్రీ చక్రార్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు అర్చనలు చేశారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

హెచ్‌సీజీ క్యాన్సర్ ఆస్పత్రి తనిఖీ



పటమట(విజయవాడతూర్పు): ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగుల పట్ల వైద్యులు నిబద్ధతతో వ్యవహరించాలని ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎం.సుహాసిని పేర్కొన్నారు. హెచ్‌సీజీ క్యాన్సర్ ఆస్పత్రిని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిని పరిశీలించారు. రోగులు ఆస్పత్రిలో పొందే సేవల వివరాల పట్టిక, నివేదిక తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో వైద్య బృందం ఎన్‌హెచ్‌ఎం డీపీఎంవో డాక్టర్ నవీన్, డాక్టర్ బాలాజీ, డాక్టర్ విద్యాసాగర్, డెప్యూటీ డెమో ప్రభాకర రెడ్డి, ఎంపీహెచ్ రాజశేఖర్, కోటేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ డి.నాంచరయ్య, హెచ్‌సీజీ చీఫ్ ఆపరేటింగ్ అధికారి కిశోర్, మెడికల్ అడ్మిన్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

భర్త, అత్తమామలపై వేధింపుల కేసు

పాయకాపురం(విజయవాడరూరల్): గర్భిణీనని చూడకుండా తన భర్త, అత్తమామలు వేధింపులకు గురిచేస్తున్నారని, ఇంట్లోకి కూడా రానివ్వడం లేదని నున్న గ్రామానికి చెందిన యనగంటి ఉమా నున్న పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేసింది. నున్న పోలీసులు తెలిపిన వివరాలు.. నున్న గ్రామానికి చెందిన యనగంటి భార్గవ్‌కు, పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన ఉమాకు 2018లో వివాహం జరిగింది. వీరికి ఒక మగబిడ్డ. ప్రస్తుతం ఆమె గర్భిణీ. గత కొన్ని రోజులుగా భార్యభర్తల మధ్య సఖ్యత లేక దూరంగా ఉంటున్నారు. ఆమె పుట్టింటి వారు భర్తతో చర్చలు జరిపిన పిమ్మట సర్నారావుపేటలో ఉంటున్నారు. విజయవాడలో పని ఉందంటూ భార్గవ్ గత నెల 17న విజయవాడ వచ్చాడు. అప్పటి నుంచి భార్య దగ్గరకు వెళ్లలేదు. దీంతో ఆమె తన కుమారునితో నున్న గ్రామం రాగా భర్త, అత్తమామలు తనను ఇంట్లోకి రానివ్వడంలేదని, రోడ్డుపైనే ఉండవలసి వస్తోందని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

భక్తులకు మరిన్ని సదుపాయాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ దర్శనానికి విచ్చేసే భక్తులందరికీ అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని ఈఓ కెఎస్. రామరావు తెలిపారు. దుర్గగుడి ఘాట్ రోడ్డులో కొండపైకి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కుళాయిలను శుక్రవారం ఈఓ ప్రారంభించారు. ఘాట్‌రోడ్డు మీదుగా కొండపైకి చేరుకునే భక్తులు కాళ్లు శుభ్రం చేసుకునేందుకు వీలుగా కుళాయిలను ఏర్పాటు చేశామని చెప్పారు. లక్ష్మీ గణపతి ప్రాంగణం వద్ద క్యూలైన్ల ఏర్పాట్లను పరిశీలించిన ఈఓ పలు సూచనలు చేశారు.

పేద కుటుంబం పొట్ట కొట్టారు!



టిఫిన్ సెంటర్ తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది



టిఫిన్ సెంటర్‌ను తొలగించవద్దని విలపిస్తున్న యజమాని అంజమ్మ

- టిఫిన్ సెంటర్ తొలగించిన టౌన్ ప్లానింగ్ అధికారులు
- ప్రాథేయపడినా కనికరించని వైనం

కృష్ణలంక(విజయవాడతూర్పు):రాణిగారితోటలో సిమెంట్ గోడౌన్స్ సమీపంలో ఫీడర్ రోడ్డు వెంబడి ఎన్నో ఏళ్లుగా ఉన్న టిఫిన్ సెంటర్‌ను టౌన్ ప్లానింగ్ సిబ్బంది శుక్రవారం తొలగించారు. 18 డివిజన్‌లో సిమెంట్ గోడౌన్స్ ఎదురుగా జాతీయ రహదారి గోడను ఆనుకుని మెట్ల వెంబడి ఉన్న ఆక్రమణలను తొలగించాలని వారం రోజుల క్రితం టౌన్ ప్లానింగ్ అధికారులు టిఫిన్ సెంటర్ యజమానికి సూచించారు. వారం గడిచిన తొలగించకపోవడంతో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ కొండలరావు తన సిబ్బందితో వెళ్లి టిఫిన్ సెంటర్‌ను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. తొలగించే క్రమంలో యజమాని రాగం అంజమ్మ, ఆమె కుటుంబ సభ్యులు ఎంత ప్రాథేయపడినా అధికారులు వినలేదు. తమ జీవనోపాధి ఇదేనని, ఇది లేకపోతే కుటుంబమంతా రోడ్డున పడతామని గోడువెళ్లబోసుకుంది. తమ పొట్ట కొట్టొద్దని విలపించింది. అయినప్పటికీ కనికరించకుండా తొలగింపు చర్యలు మొదలుపెట్టారు. దీంతో కొంతసేపు ఉద్రిక్తత చోటుచేసుకోవడంతో పోలీసుల పహారాలో టిఫిన్ సెంటర్‌ను తొలగించారు.

అనుమతి లేకుండా ఎవరైనా రోడ్డు ఆక్రమించినా, రోడ్డు వెంబడి వాహనాలను పార్కింగ్ చేసి ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించినా చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

టిఫిన్ సెంటరే ఆధారం

గత 30 ఏళ్లుగా ఈ ప్రాంతంలోనే తోపుడు బండి పెట్టుకుని టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నాం. మా కుటుంబమంతా దానిమీదే ఆధారపడి జీవిస్తున్నాం. కొందరు వ్యక్తులు మా ఎదుగుదలను చూసి ఓర్వలేక కావాలనే తమ టిఫిన్ సెంటర్‌ను తొలగించాలని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిని తొలగించడంతో కుటుంబమంతా రోడ్డున పడ్డాం. మా పొట్ట కొట్టడంతో వాళ్ల కళ్లు మంటలు చల్లారాయి.

–రాగం అంజమ్మ, టిఫిన్ సెంటర్ యజమాని

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటాం

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టిఫిన్ సెంటర్‌ను తొలగించాం. వారం రోజుల క్రితమే ఆక్రమణలను తొలగించాలని యజమానికి సూచించినా స్పందించలేదు. దీంతో తన సిబ్బందితో వచ్చి తొలగించాల్సి వచ్చింది. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించినా, రోడ్ల వెంబడి టిఫిన్ బండ్లు, లారీల పార్కింగ్, బడ్డీలు ఏర్పాటుతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికుల నుంచి అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. వాటన్నింటినీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిపై తగు చర్యలు తీసుకుంటాం.

–కొండలరావు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్

నేడు ఉచిత రేబిస్ వ్యాక్సిన్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రపంచ జూనోసిస్ డేను పురస్కరించుకుని శనివారం ముత్యాలంపాడు గ్రామీణ పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్ వేయనున్నట్లు వైద్యశాల వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ జి.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఉచితంగా వ్యాక్సిన్ వేయడం జరుగుతుందన్నారు. కావున పెంపుడు కుక్కల యజమానులు వారి కుక్కలకు వ్యాక్సిన్ వేయించుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు, స్థానిక కార్పొరేటర్ పెనుమత్స శిరీష, ఎన్టీఆర్ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కె.విద్యాసాగర్, డెప్యూటీ డైరెక్టర్ వి.గోపీచంద్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ డి.రాజశేఖర్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ కె.వి.రామకృష్ణ తదితరులు పాల్గొని జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల గురించి అవగాహన కలిగిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని సత్యనారాయణపురం, అజిత్ సింగ్‌నగర్, భవానీపురం, దుర్గాపురం రామకృష్ణాపురం, విద్యాధరపురం, దేవీనగర్, ఆర్ఆర్ పేట పైపుల రోడ్డు, కండ్రిక తదితర ప్రాంతాల్లోని జంతు ప్రేమికులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

చిన్నారుల వైద్యానికి ఆర్థిక సాయం



చిన్నారి ధన్విత తండ్రి ప్రసాద్‌కు సాయం అందిస్తున్న గోవిందరాజులు



పసికందు వైద్యానికి సాయం అందజేస్తున్న హెడ్‌కానిస్టేబుల్స్ నాగబాబు, రమణా నాయక్

భవానీపురం(విజయవాడపశ్చిమ):అనారోగ్యంతో బాధపడుతూ హాస్పటల్స్‌లో చికిత్స పొందుతున్న ఇద్దరు చిన్నారుల వైద్య ఖర్చుల నిమిత్తం దీవెన ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ తమ వంతుగా ఆర్థిక సాయాన్ని అందచేశారు. విజయవాడ మధురానగర్‌కు చెందిన ప్రసాద్, సునీత దంపతుల మూడు సంవత్సరాల కుమార్తె ధన్విత బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతుంది. తమ కూతురు ప్రాణాలను కాపాడేందుకు ఆ పేద దంపతులు ఇప్పటికే తాహతుకు మించి ఖర్చు చేశారు. ఈ క్రమంలో వారు దీవెన ఫౌండేషన్ సంస్థను ఆశ్రయించగా విజయవాడ సిటీ పోలీస్ తరుపున రూ.15 వేలు ఆర్థిక సహాయంగా అందచేశారు. హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ హాస్పటల్‌లో చిన్నారి ధన్విత చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఫౌండేషన్ గ్రూప్ సభ్యులు సాయిరాం ప్లాస్టిక్స్ గోవిందరాజులు అక్కడికి వెళ్లి తండ్రి ప్రసాద్‌కు నగదు అందచేశారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం దీవెన ఫౌండేషన్ సంస్థ సామాజిక బాధ్యతగా భావిస్తుందని ఆయన పేర్కొన్నారు.

పది రోజుల పసికందు వైద్యానికి..

విజయవాడ సత్యనారాయణపురం రామకోటి మైదానం దగ్గర నివసించే మహాలక్ష్మి, తేజ దంపతులు రోజువారి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సుమారు పది రోజుల క్రితం వారికి జన్మించిన చిన్నారి బ్లడ్ ఇన్ఫెక్షన్ హైపోథెర్మియా వ్యాధితో బాధపడుతుంది. ఇంట్లో లక్ష్మి పుట్టిందని సంతోషపడుతున్న ఆ పేద దంపతులకు చిన్నారికి కలిగిన అనారోగ్యం హతాశులను చేసింది. పని చేస్తేనే కుటుంబం గడవని పరిస్థితుల్లో కూడా తమ చేతనైనంత వరకు ఖర్చు చేసి చికిత్స చేయిస్తున్నారు. ఈ క్రమంలో సహాయం కోసం దీవెన ఫౌండేషన్ సంస్థను ఆశ్రయించారు. వెంటనే స్పందించిన దీవెన ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీస్ తరుపున రూ.10 వేలు నగదును గ్రూప్ సభ్యులు హెడ్‌కానిస్టేబుల్ నాగబాబు, రమణా నాయక్‌లు చిన్నారి చికిత్స పొందుతున్న హాస్పటల్‌కు వెళ్లి అందజేశారు.

శేషసాయిలో ఆకట్టుకుంటున్న ఎగ్జిబిషన్




ఎగ్జిబిషన్‌లో చీరలు చూస్తున్న మహిళ

లబ్బీపేట(విజయవాడతూర్పు): మహాత్మాగాంధీ రోడ్డులోని శ్రీ శేషసాయి కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న హ్యాండ్ టు హ్యాండ్ ఎగ్జిబిషన్ మహిళలను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ నెల 4న ప్రారంభమైన ఈ ప్రదర్శన 8 వరకూ కొనసాగనుంది. ఈ ప్రదర్శనలో వెడ్డింగ్, ట్రెడిషనల్ శారీస్, టాప్స్, లెనిన్ వంటి వస్త్రాలు ఆకట్టుకుంటున్నారు. చేనేత, ప్రింటెడ్ వస్త్రాలతో పాటు పోచంపల్లి, కళంకారీ శారీస్, కోల్‌కత్తా ట్రెడిషనల్ శారీస్, బగల్‌పూర్ ప్రింట్స్, లక్నో చికాన్‌వర్క్, బెనారస్ సిల్క్ వంటివి ప్రదర్శనలో కొలువుతీరాయి. ప్రతిరోజూ ఉదయం 11 నుంచి రాత్రి 8.30 గంటల వరకూ ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. అన్ని రకాల డెబిట్, క్రెడిట్ కార్డులు అనుమంతించనున్నట్లు పేర్కొన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ ఉపేంద్ర బాబు మృతి



ఉపేంద్ర బాబు భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న ఏపీయూడబ్ల్యూజే నేతలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీనియర్ జర్నలిస్టు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గారపాటి ఉపేంద్ర బాబు (88) శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందారు. ఉపేంద్ర బాబు 1976–78 కాలంలో రెండుసార్లు ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేశారు. మరణవార్త తెలుసుకున్న ఏపీయూడబ్ల్యూజే విజయవాడ యూనిట్ అధ్యక్షుడు చావా రవి, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కంచల జయరాజ్, ఐజేయూ కౌన్సిల్ సభ్యుడు షేక్ బాబు, సీనియర్ నేతలు గరికపాటి రవి కుమార్, పొట్లూరి వెంకట్రావు, కృష్ణేవ్, సురేష్ బాబు ఆయన నివాసానికి వెళ్లి ఉపేంద్ర బాబు భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటించారు.

ఐజేయూ, ఏపీయూడబ్ల్యూజే నేతల సంతాపం

ఉపేంద్ర బాబు మృతికి ఐజేయూ అధ్యక్షులు, తెలంగాణ ప్రభుత్వ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమ సుందర్, కార్యవర్గ సభ్యులు ఆలపాటి సురేష్ కుమార్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వి. సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్ సంతాపం తెలియజేశారు. ఆయన మృతి పత్రికా రంగానికి, యూనియన్‌కు తీరని లోటని వారు పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు సెక్షన్ 11కేవీ లోటస్ ఫీడర్ పరిధిలో విద్యుత్ వైర్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోటస్ సెక్టార్–3, లోటస్ మెయిన్ రోడ్డు, కేదారేశ్వరపేట జీరో లైన్ నుంచి ఐదో లైన్ వరకు గల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు జరుగుతున్నందున శనివారం ఉదయం ఎనిమిది నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ బీవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శాంతినగర్, ప్రశాంతినగర్, ఓల్డ్ పాయకాపురం, నూజివీడు మెయిన్‌రోడ్ కండ్రిక, బర్మాకాలనీ, విశాలాంధ్ర కాలనీ, రాధానగర్, డాక్టర్స్ కాలనీ, ఏపీఎస్ రెడ్డి రోడ్, ఓల్డ్ రాజీవ్‌నగర్ కాలనీ, న్యూ రాజీవ్‌నగర్, ప్రకాష్‌నగర్, ఎల్‌బీఎస్ నగర్, పాయకాపురం సబ్‌స్టేషన్ నుంచి పైపులరోడ్డు వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని 64 డివిజన్లలో వీఎంసీ ఆధ్వర్యంలో డివిజన్ల అభివృద్ధికి ఏర్పాటు చేసిన వీఎంసీ స్థాయీ సంఘం ఎన్నికల్లో శుక్రవారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తయింది. మేయర్ అధ్యక్షతన ఆరుగురు సభ్యులతో నియామకమయ్యే ఈ సంఘానికి మొత్తం 9 మంది కార్పొరేటర్లు నామినేషన్లు సమర్పించగా ఇద్దరు ఉపసంహరించుకున్నారు. స్థాయీ సంఘానికి ఏడుగురు కార్పొరేటర్లు పోటీ చేస్తుండగా వారిలో తూర్పు నియోజకవర్గం నుంచి భీమిశెట్టి ప్రవల్లిక, అంబలపూడి నిర్మల, సెంట్రల్ నియోజకవర్గం నుంచి వల్లూరి ఎస్‌డీ శర్వాణీ మూర్తి, ఈసరపు దేవి, పశ్చిమ నియోజకవర్గం నుంచి బాపతి కోటిరెడ్డి, మహ్మద్ ఇర్ఫాన్ పోటీలో ఉన్నారు. టీడీపీ నుంచి చెన్నగిరి రామ్మోహనరావు పోటీ చేస్తున్నారు. దీనిపై ఈ నెల 9వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఎన్నిక జరుగుతుందని ఎన్నికల అధికారి, వీఎంసీ అదనపు కమిషనర్(జనరల్) మహేష్ తెలిపారు.

జంతువుల ద్వారా వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పటమట(విజయవాడతూర్పు): పెంపుడు జంతుల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల పెంపకందారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని వీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారి డాక్టర్ పి.రత్నావళి తెలిపారు. ప్రపంచ జునోనిస్ డే సందర్భంగా విజయవాడ నగరపాలక సంస్థ, పశుసంవర్ధక శాఖ, ఎన్టీఆర్ జిల్లా, జీవకారుణ్య సంస్థ, సాయి బాబా సత్సంగ సేవ సమితి వారి ఆధ్వర్యంలో శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో కుక్కలకు ర్యాబిస్ వ్యాక్సిన్లు వేస్తామని చెప్పారు. కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటరు, కేబీఎన్ కాలేజ్ , భవానీపురం ఐరన్ యార్డులోని జీవకారుణ్యం ఆశ్రమం, ఐరన్ కాంప్లెక్స్ వద్ద వీధి, పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేస్తామన్నారు.

ఆటో ఢీకొని భార్యాభర్తకు గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆటో ఢీకొని భార్యాభర్తకు గాయాలైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చిట్టినగర్ ప్రైజర్‌పేట కొండ ప్రాంతంలో యర్రసాని దాసు, విజయ దంపతులు నివాసం ఉంటున్నారు. శుక్రవారం దాసు, విజయ ఎర్రకట్ట వద్ద రోడ్డు దాటుతుండగా, ఓ ఆటో వేగంగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో భార్యాభర్తలకు గాయాలు కాగా విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్ చోరీపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైక్ చోరీకి గురైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. చిట్టినగర్ కొండ్రు వారి వీధికి చెందిన ఇస్మాయిల్ బేగ్ కుటుంబం నివాసం ఉంటుంది. బేగ్ వెల్డింగ్ పని చేస్తుంటాడు. బేగ్ తన అవసరాల కోసం బైక్‌ను కొనుగోలు చేసి వాడుకుంటున్నాడు. ఈ నెల 4వ తేదీన ఇంటి ముందు బైక్‌ను పార్కింగ్ చేసిన బేగ్ మరుసటి రోజు ఉదయం లేచి చూసే సరికి బైక్ కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

విద్యార్థులు దేశభక్తిని అలవర్చుకోవాలి



విద్యార్థికి ప్రోత్సాహకాలు అందజేస్తున్న మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, నరసరాజు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో దేశభక్తిని అలవర్చుకోవాలని మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు పిలుపునిచ్చారు. స్థానిక ముత్యాలంపాడు శ్రీ గోకరాజు రంగరాజు కల్యాణ మండపంలో అల్లూరి జయంతి పురస్కరించుకుని శ్రీ అల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయం ఆధ్వర్యాన ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహకాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దాతల సాయం సద్వినియోగం చేసుకుని జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. మాజీ డెప్యూటీ మేయర్ సామంతపూడి నరసరాజు మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి వారికి ప్రోత్సాహకాలు అందజేస్తున్న శ్రీ అల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయం, సాంస్కృతిక సంఘం సభ్యులను అభినందించారు. ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులే రాబోయే రోజుల్లో దాతలుగా మారి మరో నలుగురికి సాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అల్లూరి స్మారక గ్రంథాలయం అధ్యక్ష, కార్యదర్శులు కే సుబ్బరాజు, పీవీ సుబ్బరాజు, కోశాధికారి శ్రీనివాసరాజు, సాంస్కృతిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వరరాజు, ప్రసాదరాజు, కోశాధికారి డీజేపీఎన్ రాజు, డాక్టర్ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలు



లయన్స్ క్లబ్ జిల్లా కోఆర్డినేటర్ కాంతారావును అభినందిస్తున్న సభ్యులు

ఆటోనగర్(విజయవాడతూర్పు): లయన్స్ క్లబ్ ఆఫ్ ఆటోనగర్ జెమ్స్ ద్వారా ప్రజలకు సేవ చేసేందుకు మంచి అవకాశం వచ్చిందని అధ్యక్షుడు ఎం.రవీంద్రనాథ్ తెలిపారు. ఆటోనగర్ జెమ్స్ లయన్స్ క్లబ్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ జిల్లా కోఆర్డినేటర్ బెవర నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఏడాది లయన్స్ సేవలను ప్రజల్లోకి తీసుకెళతామన్నారు. అందుకు సంబంధించిన చేయాల్సిన సేవా కార్యాక్రమాలను సమీక్షించారు. కార్మికులకు త్వరలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు చెప్పారు. సేవలు అందించిన కాంతారావును క్లబ్ సభ్యులు సన్మానించారు. అనంతరం క్లబ్ సేవలకు గానూ ఆయన ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆటోనగర్ జెమ్స్ కార్యదర్శి బి.కిరణ్, కోశాధికారి ఎస్.రాము, జెడ్‌సీ ఇస్మాయిల్, సుంకర దుర్గాప్రసాద్, కలాం బ్యాటరీవర్క్స్ అధినేత అబ్దుల్ కలాం, కత్తిక శివనాగేశ్వరరావు, అన్నె శివనాగేశ్వరరావు, సుంకాని వెంకట త్రినాథ్, తాతినేని రమేష్, ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ



సర్టిఫికెట్లను అందిస్తున్న హేమవతి రాజ్యలక్ష్మి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):మహిళలు తమ అభివృద్ధికి వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని టప్పర్ వేర్ డిస్ట్రిబ్యూటర్ ఆఫ్ ఏపీఎండీటీ హేమవతి రాజ్యలక్ష్మి అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఉమెన్స్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత బ్యూటీ ట్రైనింగ్ క్యాంపు ముగింపు సందర్భంగా సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన హేమవతి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ మహిళలు తమ కాళ్లపై తాము నిలబడే దిశగా అడుగులు వేయాలని సూచించారు. ఆ క్రమంలో వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మహిళలు సమాజంలో ముందుకు సాగాలని చెప్పారు. కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం తమ కళాశాల ఉమెన్స్ స్టడీ సెంటర్ విభాగం పలు కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. సభకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. నారాయణరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు టీ విజయలక్ష్మీ, సెంటర్ కన్వీనర్ వి.శైలజ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు



సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎన్టీఆర్ జిల్లా మలేరియా అధికారి సూర్యనాయక్

కృష్ణలంక(విజయవాడతూర్పు): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎన్టీఆర్ జిల్లా మలేరియా అధికారి సూర్యనాయక్ అన్నారు. కృష్ణలంకలో జ్వరాలు ప్రబలే సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి శుక్రవారం సిబ్బందితో డోర్ టు డోర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనాయక్ మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాలతో సీజనల్ వ్యాధులు కలరా, మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలకుండా నీరు నిలువ ఉన్న ప్రాంతాలను గుర్తించి రోడ్డు పక్క కాలువల్లో యాంటీ లార్వెల్ మెజర్స్ చేపడుతున్నామని తెలిపారు. అనుమానం ఉన్న వారి నుంచి, ఏఎన్ఎంలు, మలేరియా సిబ్బంది ద్వారా రక్త నమూనాలు సేకరించి పరీక్షల అనంతరం ఎమర్జెన్సీ వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. సిబ్బంది ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలందరూ అవగాహన కలిగి ఉండి అనుమానం వస్తే సమీపంలోని పీహెచ్‌సీకి గానీ, వైద్య ఆరోగ్య కేంద్రానికి గానీ వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని తెలిపారు. కార్యక్రమంలో సబ్ యూనిట్–2 అధికారి శ్రీనివాస్ సూపర్‌వైజర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న హరికథా గానం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం ఒంగోలుకు చెందిన వేదవతి భాగవతారిణి ఆలపించిన హరికథా గానం భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై వేదవతి శివలీలలు, అమ్మవారి మహిమలపై చక్కటి వ్యాఖ్యానంతో హరికథను ఆలపించారు. వేదవతి భాగవతారిణికి కీబోర్డుపై నాగమల్లేశ్వరరావు, తబలాపై లక్ష్మీనారాయణ చక్కటి సహకారం అందించారు.